# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 22-09-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. తిరుమల పవిత్రతను పరిరక్షించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

**2. తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ ఘటనను నిరసిస్తూ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ 11 రోజుల ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారు.**

**3. గ్రామీణ ప్రాంతాల్లో నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరాకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు.**

**4. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత పరీక్ష.. ఏపీ టెట్-2024 పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లు విడుదలయ్యాయి.**

**5. అనంతపురం, తిరుపతి జిల్లాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు మరణించగా, నలుగురు తీవ్రంగా గాయపడ్డారు.**

==========================

తిరుమల పవిత్రతను కాపాడే విషయంలో అన్ని చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ వ్యవహారంపై మంత్రులు, ఉన్నతాధికారులు, తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారి, ఆగమ శాస్త్ర పండితులతో గుంటూరు జిల్లా ఉండవల్లిలోని తన నివాసంలో ముఖ్యమంత్రి ఈ రోజు సమీక్ష నిర్వహించారు. టీటీడీ ప్రక్షాళన, ఆలయ సంప్రోక్షణకు సంబంధించి ఈవో జె.శ్యామలరావు ఆయనకు ప్రాథమిక నివేదికను అందజేశారు. శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ సంప్రోక్షణపై ఆగమ సలహాదారులు, వేద పండితుల సూచనలను ఈవో ముఖ్యమంత్రికి వివరించారు. కాగా..వచ్చే నెల 4వ తేదీ నుంచి జరిగే బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రిని దేవస్థానం ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆహ్వానించారు. ఈ మేరకు ఆయనకు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు, వేదపండితులు చంద్రబాబు నాయుడుకు ఆశీర్వచనం ఇచ్చి, తీర్థ ప్రసాదాలు అందించారు.

--------------------------

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదం కల్తీ ఘటనను నిరసిస్తూ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారు. గుంటూరు జిల్లా నంబూరులోని దశావతార వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆయన ఈ రోజు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. 11 రోజుల పాటు పవన్ కల్యాణ్ దీక్ష కొనసాగించనున్నారు. అనంతరం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకోనున్నారు. దీక్ష చేపట్టిన అనంతరం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో ఆలయాలను అపవిత్రం చేశారని విమర్శించారు. ప్రసాదాల కల్తీ, నాణ్యత

లేమి గురించి గతంలోనే చెప్పామని పవన్ పేర్కొంటూ..

వాయిస్ 20 సెకన్స్

---

గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరం సరఫరా అయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి రవికుమార్, స్థానిక శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు భూమి పూజ కార్యక్రమాలు  నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో ఎదురయ్యే సమస్యలన్నింటినీ పరిష్కరిస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 45 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని.. ఇప్పటికే 15 వేల కనెక్షన్లు ఇచ్చామని మంత్రి వెల్లడించారు.

---

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మార్గదర్శకత్వంలో భారత విమానయాన ముఖచిత్రాన్ని మార్చేందుకు తన వంతు కృషి చేస్తానని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహననాయుడు పేర్కొన్నారు. ఆ శాఖ మంత్రిగా దేశవ్యాప్తంగా అత్యాధునిక మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం ద్వారా ప్రాంతీయ రవాణాలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలనే లక్ష్యానికి కట్టుబడి  ఉన్నానని సామాజిక మాధ్యమ వేదికగా ఆయన తెలిపారు. విమాన ప్రయాణాన్ని ప్రతి సామాన్యుడికీ అందుబాటులోకి తీసుకురావాలన్న తన  లక్ష్యానికి ప్రధానమంత్రి అండగా నిలిచారంటూ నరేంద్ర మోదీకి రామ్మోహన్ నాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

---

కేంద్ర ప్రభుత్వ పథకాలను కర్నూలు జిల్లా అభివృద్ధికి సమర్థవంతంగా వినియోగించుకోవాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టి.జి. భరత్ అధికారులను ఆదేశించారు. కర్నూలు జిల్లా కలెక్టరేట్‌లో నిన్న ఆయన కర్నూలు పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు అధ్యక్షతన  అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పరిశ్రమల శాఖలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తరహాలోనే జిల్లాలో అన్ని శాఖల్లో అభివృద్ధి పనులు వేగంగా జరగాలని సూచించారు. అధికారులు జవాబుదారీతనంతో పనిచేయాలని మంత్రి భరత్ కోరారు.

---

రాష్ట్రంలో వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు మరణించగా, నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం రేకులకుంట వద్ద గత అర్ధరాత్రి నార్పల వైపు వెళ్తున్న కారును లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో నలుగురు మృతి చెందారు. మృతులను అనంతపురంలోని సిండికేట్‌నగర్ వాసులుగా గుర్తించారు. తిరుపతి జిల్లా చిల్లకూరు వద్ద జాతీయ రహదారిపై ఆగి ఉన్న కంటెయినర్ లారీని వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా.. నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మృతులను నెల్లూరులోని వనంతోపునకు చెందినవారిగా గుర్తించారు. క్షతగాత్రులను గూడూరు ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు.

---

అక్రమ రవాణా సహా వివిధ మార్గాల్లో మన దేశం నుంచి తరలిపోయి అమెరికా చేరిన కళాఖండాలు తిరిగి స్వదేశానికి చేరనున్నాయి. క్వాడ్ శిఖరాగ్ర సదస్సులో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమెరికాలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా భారత్‌కు చెందిన 297 పురాతన వస్తువులు తిరిగి ఇచ్చేందుకు భారత్ – అమెరికా మధ్య ఒప్పందం కుదిరింది. భారత్ నుంచి అమెరికాకు తరలిపోయిన 297 పురాతన వస్తువులు వెనక్కి అప్పగిస్తున్నందుకు అమెరికాకు ప్రధానమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఒప్పందం సాంస్కృతిక వస్తువుల అక్రమ రవాణా నిరోధించడాన్ని బలపరుస్తుందని ఎక్స్‌లో పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత పరీక్ష.. ఏపీ టెట్–2024 పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లు విడుదలయ్యాయి. పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. కంప్యూటర్ ఆధారంగా నిర్వహించే ఈ పరీక్షకు రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 4 లక్షల 27 వేల 300 మంది దరఖాస్తు చేసుకున్నారు. అక్టోబర్ 3వ తేదీ నుంచి 20వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. అభ్యర్థులు తమ రిజిస్ట్రేషన్ నంబర్, పుట్టిన తేదీ నమోదు చేసి హాల్ టికెట్లను పొందొచ్చని అధికారులు తెలిపారు.

---------------------------

రైతులు గతంలో ఎదుర్కొన్న సమస్యలను పరి ష్కరించేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కృష్ణాజిల్లా కంకిపాడు మండలంలోని పునాదిపాడు రైతు భరోసా కేంద్రాన్ని నిన్న ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు అందుతున్న సేవలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాబోయే ఖరీఫ్ సీజన్లో రైతుల నుంచి కొనుగోలు చేయనున్న ధాన్యం, కావలిసిన వనరులపై సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ, స్థానిక వ్యవసాయశాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ధాన్యం కొనుగోలు సమయంలో ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడటంతో పాటు.. 48 గంటల్లో వారికి నగదును అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మనోహర్ హామీ ఇచ్చారు.

---------------------------

విజయవాడలో వరద ముంపునకు గురైన ప్రాంతాల్లో బీమా సంస్థల ద్వారా 5 వేల 141 దెబ్బతిన్న వాహనాలకు సంబంధించిన 20 కోట్ల 30 లక్షల రూపాయల విలువైన క్లైమ్‌లను పరిష్కరించామని రవాణాశాఖ అధికారులు తెలిపారు. డివిజన్ల వారీగా నియమించిన మోటారు వాహన ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణలో వేగంగా వాహనాల మరమ్మతులు జరిగేలా చూస్తున్నట్లు పేర్కొన్నారు. ఆ ప్రాంతాల్లో 179 ప్రైవేటు మెకానిక్‌లను అందుబాటులో ఉంచి త్వరగా మరమ్మతులు చేసేలా చూస్తున్నామని, ఇప్పటి వరకు 4 వేల 849 వాహనాలకు మరమ్మతులు చేయించామని వెల్లడించారు.

---------------------------

మాతృభాషపై పట్టు సాధిస్తే హిందీ భాష నేర్చుకోవడం సులభమవుతుందని కేంద్ర ప్రభుత్వ అధ్వర్యంలోని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ గుంటూరు క్షేత్ర ప్రచార అధికారి ఆర్.రమేశ్చంద్ర అన్నారు. సీబీసీ ఆధ్వర్యంలో గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాలలో జరిగిన హిందీ పక్షోత్సవాల సందర్భంగా జరిగిన వివిధ పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులు, ధ్రువీకరణ పత్రాలు బహుకరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడుతూ, హిందీ భాష నేర్చుకుంటే విద్య, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని తెలిపారు. మాతృభాష తెలుగు, అధికార భాష హిందీ రెండు కళ్ల వంటివన్న రమేష్ చంద్ర, రెండు భాషల మధ్య వున్న సారూప్యం, అంతరాలను వివరించారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 114వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 27వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి డి. శేషసాయి కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 27 సెకన్లు....

=======================